క్లుప్తంగా

కుమారస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో సోమవారం ఆలయ అధికారులు, అర్చకులు షష్టి పూజలు, విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, అర్చకులు ముందుగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులను అలంకార మండపంలో కొలువుదీర్చారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారాల్లో పల్లకీలో ఊరేగించారు.

సన్మానం



ఏఈఓ వెంకటేశ్వరుడు, హరినాథ్‌ను సన్మానించిన దేవస్థానం ఉద్యోగులు

మహానంది: మహానంది దేవస్థానంలో ఏఈఓగా పనిచేస్తూ కసాపురం దేవస్థానానికి బదిలీ అయిన ఓంకారం వెంకటేశ్వరుడు, శ్రీశైలం దేవస్థానానికి బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్ హరినాథ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఏఈఓ మధు ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, వేదపండితులుశాంతారాంభట్, అర్చకులు మూలస్థానం సుబ్బయ్యశర్మ, రఘుశర్మ, సిబ్బంది నాగమల్లయ్య, నీలకంఠరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు




పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్, కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు జనరల్ ఆస్పత్రి డాక్టర్లు ఇక్రమ్ ఆలీఖాన్, సింధుప్రియ, సాజిదాఫిర్దోస్, ప్రసన్నలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సాయమందించాలి

నందికొట్కూరు: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల మాల్‌ను మహిళా రైతులు ఏర్పాటు చేసి విక్రయించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలతో తయారు చేసిన వంటలను తీసుకోవడం వల్ల రోగాలు దరి చేరవన్నారు.

పేదింట్లో విద్యా కుసుమం



ఉమేష్ కుమార్

మిడుతూరు: ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ పేదింటిలో విద్యా కుసుమం విరబూసింది. మండలపరిధిలోని నాగలూటి గ్రామానికి చెందిన ఉమేష్ కుమార్ నీట్ ఫలితాల్లో 508 మార్కులతో విశ్వభారతి మెడికల్ కళాశాల కర్నూలులో మెడిసిన్ సీటు సాధించాడు. నాగలూటి గ్రామానికి చెందిన శేషురత్నం, వేణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడైన ఉమేష్ కుమార్ 1 నుంచి 5వ తరగతి వరకు నాగలూటి ప్రాథమిక పాఠశాల , 6 నుంచి 10 తరగతి వరకు మిడుతూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ఇంటర్మీడియెట్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాల చిన్న టేకూరులో పూర్తి చేశాడు.

కమిషనర్ ఉత్తర్వుల్లో పాక్షిక సవరణ

మహానంది: మహానంది దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో డీసీగా విధులు నిర్వహిస్తున్న కె.శోభారాణిని నియమిస్తూ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మరోసారి పాక్షిక సవరణ ఉత్తర్వుల్లో భాగంగా ఆమెను విశాఖపట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మీ దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. మహానంది ఈఓగా ప్రస్తుతం ఎఫ్ఏసీగా కొనసాగుతున్న నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని పల్నాడు జిల్లా అమరేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే మహానంది ఈఓగా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగిస్తారా? లేక మరొకరిని నియమిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

కొర్ర రైతుకు ధరాఘాతం

- ఆశాజనకంగా దిగుబడులు
- మార్కెట్‌లో నగానికి తగ్గిన ధర
- దిగాలు చెందుతున్న రైతులు



కల్లాలో కొర్రలను ఆరబెట్టిన దృశ్యం

మిడుతూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా మెట్టసాగుపై ఆధారపడిన రైతన్నలు వ్యవసాయం లాభసాటిగా మార్చుకునేందుకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శాస్త్రవేత్తలు కొర్ర సాగులో నూతన వంగడాలను తీసుకొని వస్తుండటంతో రైతన్నలు వాటి సాగుపై ఆసక్తిని కనపరుస్తున్నారు. అయితే ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా మార్కెట్‌లో సరైన ధరలేకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

350 హెక్టార్లలో కొర్రసాగు

అధిక పెట్టుబడులు, వ్యవసాయ కూలీల ఖర్చులు భారంగా మారడంతో పాటు వర్షాభావ పరిస్థితులు ఉండటంతో ఈ ఏడాది రైతులు మండలంలో దాదాపు 350 హెక్టార్లలో కొర్రసాగు చేపట్టారు. ఈ ఏడాది జూన్ నెల ఆరంభంలోనే వర్షాలు ఆశాజనకంగా కురియడంతో మండల పరిధిలోని మిడుతూరు, చింతలపల్లి, ఖాజీపేట, పీరుసాహెబ్ పేట, దేవనూరు, చెరుకుచెర్ల, తిమ్మాపురం, రోళ్లపాడు, అలగనూరు తదితర గ్రామాల్లో కొర్రను అధిక విస్తీర్ణంలో వేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నందికొట్కూరు మండలంలో 50 హెక్టార్లు, జూపాడుబంగ్లా మండలంలో 100 హెక్టార్లు, పగిడ్యాల 15 హెక్టార్లు, పాములపాడు మండలంలో 20 హెక్టార్లలో కొత్తపల్లి మండలంలో 15 హెక్టార్లలో కొర్ర పంట సాగయ్యింది. చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక దిగుబడిని పొందేందుకు రూపొందించిన నూతన వంగడాలు 70 నుంచి 100 రోజుల్లోనే పంట చేతికి వచ్చేలా రూపొందిచడం జరిగింది. దీంతో నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు అధిక విస్తీర్ణంలో కొర్ర సాగుపై ఆసక్తి కనపరిచారు.

నగానికి పడిపోయిన ధర

విత్తుకునే సమయంలో బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ. 4వేల నుంచి రూ.6 వేల వరకు ఉండటంతో కొర్ర సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం పంట చేతికందుతున్న సమయంలో ఒక్కసారిగా



పొలంలో సాగు చేసిన కొర్ర

నగానికి పైగా ధర పడిపోవడంతో రైతన్నలు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందవని దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటాల్ రూ. 2,200 నుంచి రూ.2,500 ఉండటంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. పంట విత్తే సమయంలో ఒక ధర.. పంట చేతికందే సమయంలో ధర పూర్తిగా పతనం కావడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటకు తగిన గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం తో పాటు దళారుల సిండికేట్ వ్యాపారానికి అడ్డుకట్ట వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధర పతనం.. బాధాకరం..



గతేడాది కొర్ర సాగు లాభదాయకంగా ఉంది. ఈ ఏడాది మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ. 2,500 ఉండటంతో పెట్టుబడులు చేతికి అందని పరిస్థితి . ఒక ఎకరానికి కొర్ర కోతకు రూ. 4,500 ఇస్తున్నాం. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం.

–వెంకటసుబ్బారెడ్డి, చింతలపల్లి , రైతు

ప్రభుత్వం కొర్ర రైతులను ఆదుకోవాలి



కొర్ర పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. పంట చేతికి అందే సమయంలో ధర పతనం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సిండికేట్ వ్యాపారులపై నిఘా ఉంచి రైతులు మోసపోకుండా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వమే కొర్రలను కొనుగోలు చేయాలి. గతేడాది బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ 4 వేల నుంచి రూ.6 వేల వరకు పలికింది.

– పి.సుధాకర్‌రెడ్డి , పీరుసాహెబ్‌పేట , రైతు

స్కూళ్లు, కళాశాలల వేళకు బస్సులు నడపాలని

జూపాడుబంగ్లా: పాఠశాలలు, కళాశాలల వేళకు ఆర్టీసీ బస్సులు నడపటంతో పాటు మండ్లెంలో నిలపాలని కోరుతూ సోమవారం విద్యార్థులు కేజీ రోడ్డుపై ధర్నా చేశారు. గ్రామం నుంచి సుమారు 150మంది విద్యార్థులు నందికొట్కూరు, జూపాడు బంగ్లా, కర్నూలు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు విద్యను అభ్యసించేందుకు వెళ్తున్నామన్నారు. ప్రతి నెలా నందికొట్కూరు ఆర్టీసీ డిపోలు నగదు చెల్లించి బస్సుపాసులు తీసుకొంటున్నామని, అయితే ఆత్మకూరు డిపో వారు తమ డిపోలో బస్సుపాసులు తీసుకోలేదనే ఉద్దేశంతో మండ్లెంలో బస్సులు నిలపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో తాము సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ధర్నాతో కేజీ రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. విషయం తెలుసుకొన్న ఏఎస్ఐ మేరీజయంతి సిబ్బందితో మండ్లెం గ్రామానికి చేరుకొని విద్యార్థులు, డిపో మేనేజర్‌తో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

నందికొట్కూరు: విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మీట్ కమ్ సెలక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, గ్రామ సర్పంచు సుశీలమ్మ, ఎంపీటీసీ తిప్పారెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం అనితా జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'ను సద్వినియోగం చేసుకోవాలి



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురించి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, వైద్యులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పట్టణ స్వచ్ఛతే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు భరత్‌కుమార్, సాయిసుధ, శ్వేత, దినేష్, భువనేశ్వరి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దబావిలో చెత్తాచెదారం తొలగింపు



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలోని పెద్దబావిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు హేమశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు సోమవారం శుభ్రం చేశారు. పెద్దబావి నుంచి గ్రామంలోని కుళాయిలకు నీరు సరఫరా అవుతుంది. బావిలో చెత్తాచెదారం పేరుకపోయి నీరు కలుషితం అవుతుండటంతో గమనించిన హేమశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు జాకీర్‌హుసేన్, జనార్దన్‌రెడ్డి, పాలరాము, లోకేశ్వరరెడ్డి, తలారిశివుడు చేయీ చేయీ కలిపి బావిలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. నీటిలో బ్లీచింగ్ పొడరు కలిపారు.

శ్రీశైల దేవస్థానంలో ఉద్యోగుల బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు మహానందికి, ఐ.ఎస్.వి.మోహన్ కసాపురానికి, బి.మల్లికార్జునరెడ్డి శ్రీకాళహస్తి, జి.స్వాములు కాణిపాకం ఆలయాలకు బదిలీ అయ్యారు. అలాగే పర్యవేక్షకులు పి.దేవిక మహానందికి, కె.సాయికుమారి శ్రీకాళహస్తికి, స్వర్ణలత కదిరి దేవస్థానానికి బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది మొత్తం 22మంది రెగ్యులర్ ఉద్యోగులు శ్రీశైల దేవస్థానం నుంచి ఇతర దేవస్థానాలకు బదిలీ అయ్యారు.

శ్రీశైల దేవస్థానానికి రాని ఉద్యోగులు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలలో భాగంగా దేవదాయశాఖ పరిధిలోని అన్ని ప్రముఖ ఆలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులను వారు పనిచేస్తున్న దేవస్థానాల నుంచి ఇతర దేవస్థానాలకు బదిలీ చేశారు. ఇందులో భాగంగానే శ్రీశైల దేవస్థానం నుంచి 22మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ అయ్యారు. అయితే శ్రీశైల దేవస్థానం నుంచి నలుగురు ఏఈవోలు, ముగ్గురు పర్యవేక్షకులు బదిలీ కాగా వీరి స్థానంలో ఇతర దేవస్థానాల నుంచి ఒక్క ఏఈవో రాలేదు. ఒక పర్యవేక్షకులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు తప్పా ఎవరిని బదిలీ చేయలేదు.

శ్రీశైలం నుంచి మహానందికి రానున్న ఉద్యోగులు

మహానంది: రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీశైలం ఆలయం నుంచి పలువురు ఉద్యోగులు మహానంది దేవస్థానానికి రానున్నారు. ఈ మేరకు శ్రీశైలంలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ ఎం.హరిదాసు, సూపరింటెండెంట్ పి.దేవిక, సీనియర్ అసిస్టెంట్లు పి.సుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి మహానందికి బదిలీ అయ్యారు. వారితో పాటు జూనియర్ అసిస్టెంట్లు వెంకటలక్ష్మీ, అనురాధ, లోకేశ్వరప్ప, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసప్రసాద్‌ను మహానందికి బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మహానందిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సూరె హరినాథ్‌ను శ్రీశైలం బదిలీ చేశారు.

క్రీడా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థినులతో ఎస్ఓ విజయలక్ష్మి



నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన వేంపెంట విద్యార్థులతో ఉపాధ్యాయులు

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 19, 20 తేదీల్లో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ కనపరచినట్లు ఎస్ఓ విజయలక్ష్మి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, సాఫ్ట్ బాల్ త్రో, యోగా, అథ్లెటిక్స్ , కబడ్డీ, రన్నింగ్, పోటీల్లో రాణించిన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ సుమలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపిక

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయికి ఎంపికై న క్రీడాకారులకు సోమవారం అభినంద సభ నిర్వహించారు. హెచ్ఎం క్రిష్ణమూర్తి మాట్లాడుతూ..మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ రన్నర్స్‌గా నిలిచామన్నారు. పలువురు విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకేత భాషా దినోత్సవం

వెలుగోడు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సంకేత భాష దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ హెగ్డే సంకేత భాష ప్రాముఖ్యతను వివరించారు. మనం ఎవరికైనా విషయం చెప్పాలంటే భాషతో పాటూ మాట్లాడాలి...అలాగే వినగలగాలి. మరి బధిరుల పరిస్థితేంటి... వారు మాట్లాడలేరు, వినలేరు. దీంతో వారికి సమాచారం అందించేందుకు పుట్టినదే సంకేత భాష అని తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులు రవిశంకర్, అన్నపూర్ణమ్మ, సయ్యద్ మొయినుద్దీన్ సంకేత భాష అవసరాన్ని వివరించారు. అనంతరం సంకేత భాష ఉపాధ్యాయులు ఎన్ అన్నపూర్ణమ్మ, వినితరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌభాగ్యమ్మ, రేణుక, రమాదేవి, హైమావతి, నాగవాణి పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు

బండి ఆత్మకూరు : అదనపు కట్నం కోసం తన భర్త ప్రతాప్, అత్త కుమారి, మామ రమేష్, చిన్న మామ శేఖర్ తమను వేధిస్తున్నారని జి.సి.పాలెం గ్రామానికి చెందిన ఎద్దుల రాణి పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని బండి ఆత్మకూరు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.

డీఆర్‌డీఏ నందికొట్కూరు ఏసీగా అంబమ్మ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఏపీఎం అంబమ్మకు నందికొట్కూరు డీఆర్‌డీఏ నందికొట్కూరు ఏరియా కోఆర్డినేటర్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా అంబమ్మ మాట్లాడుతూ నందికొట్కూరు క్లస్టర్ ఏసీ డేగలయ్య రంపచోడవరం కు బదిలీ అయినట్లు తెలిపారు. ఆయన స్థానంలో తనకు ఎఫ్ఏసీ ఏసీ గా బాధ్యతలు అప్పగిస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

కోలుకోలేక వృద్ధురాలి మృతి

నందికొట్కూరు: నందికొట్కూరు–నాగలూటి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధురాలు తెలుగు ఎల్లమ్మ(75) సోమవారం మృతి చెందినట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. ఆయన తెలపిన వివరాల మేరకు ఈ నెల 20న నందికొట్కూరు–నాగలూటి రహదారిపై బొలెరో, కూలీల ఆటో ఢీకొన్నాయి. గాయాల పాలైన కూలీలను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెలుగు ఎల్లమ్మ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



చరణ్, ఖాజా హుసేన్

నందికొట్కూరు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్ఎం సలీంబాషా తెలిపారు. ఈ నెల 21న కర్నూలు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్‌లో అండర్–17 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి కాటేపోగు చరణ్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఖాజా హుసేన్ పాల్గొంటాడని చెప్పారు.

అక్రమ మద్యం స్వాధీనం

బండి ఆత్మకూరు : మండలంలోని సంతజూటూరు గ్రామంలో మౌలాలి నుంచి అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పది రోజులుగా వర్షం లేకుండా ఎండలు ఉండడంతో వాడుపట్టిన మినుము పంటలకు వరుణుడు ఊపిరి పోశాడు.

సైబర్ నేరాలపై అవగాహన

బండి ఆత్మకూరు : మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో ప్రజలకు సోమవారం ఎస్ఐ జగన్‌మోహన్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని, ప్రలోభాలకు గురికాకూడదని ఎస్ఐ సూచించారు. అదేవిధంగా బాల్య వివాహాలు నేరమన్నారు.

వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్ల బదిలీ

జూపాడుబంగ్లా: మండల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వివిధ గ్రామాల వీఆర్వోలు, మండల ఆర్ఐ, సర్వేయర్ బదిలీ అయినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీఆర్వో బాలకృష్ణ తంగడంచ నుంచి తాటిపాడుకు, చంద్రశేఖర్‌నాయుడు తర్తూరు నుంచి తరిగోపులకు, అల్లావుద్దీన్ బ్రాహ్మణకొట్కూరు నుంచి 80బన్నూరుకు, మనోహర్ తూడిచెర్ల నుంచి నందికొట్కూరు మండలం మల్యాలకు, రియాజ్ రహమాన్ ఎదురుపాడు నుంచి తంగడంచ గ్రామానికి బదిలీ అయ్యారన్నారు. మండల ఆర్ఐ శ్రీరంగారెడ్డి జూపాడుబంగ్లా నుంచి పగిడ్యాల మండలానికి వెళ్లారని చెప్పారు. మండల సర్వేయర్ షహనాపర్వీన్ స్థానంలో బనగానపల్లె మండలానికి చెందిన షాద్ మాన్‌అతీఫ్ వచ్చారన్నారు. కాగా షహనాపర్వీన్‌కు ఇంకా ప్లేస్ కేటాయించలేదని తెలిపారు.

వచ్చారు.. పొగిడారు.. వెళ్లారు



ఎమ్మెల్యే కోసం వేచిచూస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. అయితే వారు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసే అభివృద్ధి పనులపై కాకుండా చంద్రబాబు నాయుడిని పొగడటంతోనే సరిపెట్టారు. దీంతో పొగిడారు.. వెళ్లారు అన్నట్లుగా ప్రజావేదిక జరిగిందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకున్నారు. దినికి తోడు టీడీపీలోని రెండవ వర్గం ప్రజావేదిక కార్యక్రమాన్ని బైకాట్ చేయడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉదయం 10 గంటలకు జరగాల్సిన కార్యక్రమం 12.15 నిమిషాలకు ప్రారంభం కావడంతో మహిళలు, ప్రజలు రెండు గంటలకు పైగా ఎమ్మెల్యే కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎప్పుడు వస్తాడా, ఎమి చెప్పాడా అని వేచిచూసిన ప్రజలు చంద్రబాబు పొగత్తలతో కార్యక్రమం ముగియడంతో నిరాశతో వెనుతిరిగారు.

మాకు చీకటి మిగిల్చి.. ఇతర రాష్ట్రాల్లో వెలుగునింపుతారా?

మండలానికి ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలం సమీపం నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు నీటిని సరఫరా చేస్తున్నారని, ఇక్కడ రైతులకు చీకటిని మిగిల్చి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వెలుగునింపతామని జలవనరుల శాఖ మంత్రి అనడం సమంజసం కాదని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి పొలాలను సస్యశ్యామలం చేయాలన్నారు. పంటనష్టం, పెట్టుబడి సాయం వెంటనే అమలు అయ్యేలా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఎమ్మెల్యేకు తెలిపారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్

ఆత్మకూరు: ఓ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పాములపాడు మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన సిద్ధయ్య అనే వ్యక్తి ఈనెల 14వ తేదీ నుంచి కనిపించకపోవడంతో అతడి భార్య శివమ్మ పాములపాడు పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 17వ తేదీన గడివేముల మండలం కొర్రపోలూరు గ్రామం వద్ద కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభించడంతో పోలీసులు పరిశీలించారు. సిద్ధయ్య భార్యను పిలిపించడంతో ఆమె గుర్తు పట్టగా కేసును తిరిగి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, పాములపాడు ఎస్ఐ సురేష్ కేసు విచారణ ముమ్మరం చేశారు. అదే గ్రామానికి చెందిన సురేష్, అశోక్ అనే వ్యక్తులపై అనుమానం రావడంతో పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి విచారించడంతో అసలు విషయాలు వెలుగు చూశాయి. సురేష్, అశోక్, మృతి చెందిన సిద్ధయ్య కొంతకాలంగా స్నేహితులు. వీరు ముగ్గురు మద్యం తాగే సమయంలో అప్పుడప్పుడు సిద్ధయ్య భార్య శివమ్మతో సురేష్ స్నేహంగా ఉండడంతో అనుమానించాడు. ఈనెల 13వ తేదీన కేసీ కెనాల్ సమీపంలోని బరకచేను వద్దకు వెళ్లారు. అక్కడ సిద్ధయ్య, అశోక్, సురేష్ ముగ్గురూ మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న సిద్ధయ్య తన భార్యతో నీకు అక్రమ సంబంధం ఉందని, గ్రామంలో అందరికీ తెలిపి పరువు తీస్తానని చెప్పడంతో భయాందోళనకు గురైన సురేష్ వెంటనే బండ తీసుకుని సిద్ధయ్య తలపై బాదాడు. అనంతరం సిద్ధయ్య బతికుండగానే అశోక్, సురేష్ కేసీ కెనాల్‌లో పారవేసినట్లు విచారణలో ఒప్పుకున్నారన్నారు. సీఐ, ఎస్ఐ చాకచక్యంగా వారం రోజుల్లోపు కేసును చేధించారని డీఎస్పీ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆత్మకూరు తాలూకా సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

ఆత్మకూరు: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటకు సిద్ధం కావాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బ్లాక్ డే పిలుపులో భాగంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, మండల కార్యదర్శి వీరన్న, సీఐటీయూ నాయకులు సురేంద్ర, శివ, ముర్తుజా, రఫిక్, మల్లయ్య, నాయకులు కిరణ్, కార్మికులు విజయ్, శ్రీను, రవి, వలి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు రజిత, రమేష్, ప్రతాప్, ముర్తుజా, సాంబశివుడు, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.